పశువుల మేత కొరతకు చెక్

- టీఎంఆర్ పేరుతో 141 మెట్రిక్ టన్నుల దాణా సరఫరా
- గుడివాడ నియోజకవర్గంలో 336 మంది పశు పోషకులకు లబ్ధి
- పశు పోషకులకు ప్రభుత్వం చేయూత



గుడ్లవల్లేరులో దాణా అందజేస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు(ఫైల్)

గుడివాడరూరల్: వేసవిలో పశువులకు ఏర్పడే మేత కొరతకు ప్రభుత్వం చెక్ పెట్టింది. ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చే టీఎంఆర్ పథకంతో పశువులకు మేత కొరత లేకుండా దాణాను పంపిణీ చేస్తోంది. ఈ పథకం వలన పశువులకు మేత కొరత తీరడమే కాకుండా పశు పోషకులకు ఆదాయ వనరులు సమకూరనున్నాయి. సాధారణంగా వేసవిలో ఎండల వలన పశువులకు మేత ఇబ్బంది ఏర్పడుతుంది. ఎండు గ్రాసాలు లేకపోవడంతో పశువులకు మేత కొరత ఏర్పడుతుంది. ఈ లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం సమీకృత దాణాను సబ్సిడీపై టీఎంఆర్ పథకం ద్వారా పశు పోషకులకు దాణాను పంపిణీ చేస్తోంది. ఈ దాణా వలన అధిక పాల దిగుబడి వస్తుంది. పశు పోషకులు రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాల్లో రైతుల ఆధార్ నంబర్ నమోదు చేసి నేరుగా అక్కడే నగదు చెల్లించి దాణాను బుక్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

గుడివాడ నియోజకవర్గంలో ఇలా..

గుడివాడ నియోజకవర్గంలో ఉన్న మూడు మండలాలతో పాటు అర్బన్‌లో గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 336 మంది పశు పోషకులకు 141 మెట్రిక్ టన్నుల టీఎంఆర్ దాణాను 41 ఆర్బీకేల ద్వారా సరఫరా చేశారు. మొత్తం గేదెలు 29,324, ఆవులు 3317 ఉన్నాయి. సాధారణంగా 5 లీటర్ల పాలు ఇచ్చే పశువులు రోజుకు పచ్చి మేత 30 నుంచి 40 కేజీలు, ఎండు గడ్డి 10 నుంచి 15 కేజీలు, దానా 5 నుంచి 10 కేజీలు అవసరం అవుతుంది. టీఎంఆర్‌లో జొన్న, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, కొర్రలు, నూనెతీసిన సాయచెక్క, వేరుశెనగ చెక్క, పత్తిచెక్క, వరి, గోధుమలు, తవుడు, కంది, మినుము, పెసరపొట్టు ఇలా సమీకృత ఆహారం మిళితమై ఉంటుంది.

మేతకు ఇబ్బంది లేకుండా..

వేసవిలో పచ్చి గడ్డి దొరకదు, యంత్రాలతో కోసిన ఎండుగడ్డిని తినడానికి పశువులు ఇష్టపడవు. దీంతో పశుపోషకులు టీఎంఆర్ దాణాను వినియోగించాల్సి వస్తుంది. టీఎంఆర్ దాణాను బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాలంటే జీఎస్టీతో కలిపి కేజీ రూ.16 పడుతుంది. ప్రభుత్వం ఈ దాణాను 60శాతం సబ్సిడీతో కేజీ రూ.6.50లకే అందచేస్తోంది. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ పాల దిగుబడిని సాధిస్తున్నారు. ఈ మేత రుచికరంగా ఉండటంతో పశువులు ఎక్కువగా తింటున్నాయి.



పశువులకు దాణా వేస్తున్న మహిళ

చేపల చెరువులు అధికంగా ఉన్న గ్రామాల్లో వరి పొలాలు తక్కువ. దీని వలన పశువులకు మేత దొరకడం కష్టంగా మారింది. ఈ ప్రాంతాల్లో టీఎంఆర్ దాణాను అధిక శాతం పశు పోషకులు వినియోగిస్తూ అధిక పాల దిగుబడులను సాధిస్తూ ఆర్థికపరమైన స్వాలంబన పొందుతున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

మండలం	సబ్సిడీ పొందిన రైతులు	కొనుగోలు చేసిన దాణా(మెట్రిక్ టన్నుల్లో)
గుడివాడ	101	44
గుడ్లవల్లేరు	127	64.8
నందివాడ	108	32.2
మొత్తం	336	141

60 శాతం సబ్సిడీతో సరఫరా..



టీఎంఆర్ దాణాను ప్రభుత్వం 60 శాతం సబ్సిడీతో రూ.6.50లకే కేజీ అందిస్తోంది. ఈ దాణాలో అన్ని రకాల పోషణ ఇచ్చే సమీకృతాలు మిళితం కావడంతో పశువులు ఇష్టంగా తింటున్నాయి. ఈ దాణా తినడం వలన పశువులకు జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుంది. ఆరోగ్యం, ఎదుగుదలతో పాటు పాల ఉత్పత్తి పెరగడంతో పశు పోషకులకు మేలు జరుగును. అధిక పాల దిగుబడి ద్వారా పశు పోషకులకు ఆర్థికపరమైన స్వాలంబన జరుగుతుంది. ఈ పథకాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలి.

–డాక్టర్ లక్ష్మీనారాయణ, ఏడీ వెటర్నరీ గుడ్లవల్లేరు

ఆదాయం పెరిగింది..



టిఎంఆర్ పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చే దాణా వలన పశు పోషకులకు మేలు జరుగుతుంది. అన్ని సమీకృత ఆహారం పశువులకు ఇవ్వడం వలన ఆరోగ్యంగా ఉండి అధిక పాల దిగుబడి ఇస్తున్నాయి. దీని వలన పశు పోషణ ఖర్చులు తగ్గడమే కాకుండా పాల ఆదాయం పెరిగింది. ప్రభుత్వం పశు పోషకులకు మేలు చేస్తుంది. ఈ పథకం కొనసాగించడం ద్వారా రైతులకు లాభదాయకం.

– కైలా అశోక్, పశు పోషకుడు, తటివర్రు.

నవ ధాన్యాల విత్తనాలు పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తదితరులు

ఈదులమద్దాలి(పెదపారుపూడి): మండలంలోని ఈదులమద్దాలిలో గ్రామంలోని రైతులకు ప్రకృతి వ్యవసాయం సంబంధించిన ఎన్‌ఎఫ్‌ఎఫ్ ఎంటీ సిబ్బంది అందించిన 32 రకాల నవ ధాన్యాలను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదివారం రాత్రి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో రైతులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నవ ధాన్యాల సాగుతో అనేక లాభాలు ఉన్నాయన్నారు. మొక్కలకు కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. రైతులు ఖచ్చితంగా నవ ధాన్యాలను పొలాల్లో వేసి దున్నటం ద్వారా పంట మంచి దిగుబడి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఎఫ్ ఎంటీ యూనిట్ ఇన్‌చార్జి, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

భట్లపెనుమర్రు(మొవ్వ): ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా జరుగుతున్న ఉపాధి పనులను మండల ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతిని సాధించాలని ఎంపీపీ కొండేటి ఇందిర పిలుపునిచ్చారు. మండల పరిధిలోని భట్లపెనుమర్రు గ్రామంలోని ఉపాధి పనులను ఎంపీపీ ఇందిర మంగళవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. మంగళవారం నుంచి వేతనం రూ.15 పెంచి రూ.272 అందిస్తామని ఏపీఓ లక్ష్మీరెడ్డి తెలిపారు. అలాగే మండలంలోని 19 గ్రామాల్లో 1,761 మంది ఉపాధి కూలీలు పనులు చేశారు.

క్లుప్తంగా

నేడు నిడుమోలులో గడప గడపకు మన ప్రభుత్వం

మొవ్వ: మండల పరిధిలోని నిడుమోలు శివారు మల్లేశ్వరం, వీరాయిలంక గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పాల్గొంటారన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో హాఫ్ డేస్

కైకలూరు: వేసవి నేపథ్యంలో ఏప్రిల్ 4 నుంచి మే 31వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పనిచేస్తాయని కైకలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ బి.ఆనంద్‌బాబు సోమవారం చెప్పారు. ప్రతి నెల లబ్ధిదారులకు అందించే పోషకాహార పంపిణీ యథాతథంగా కొనసాగుతుందన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ముదినేపల్లిరూరల్: చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆదేశించారు. మండలంలోని కొరగుంటపాలెంలో సర్పంచ్ పేరే రామకృష్ణ ఆధ్వర్యాన సోమవారం ఎంపీపీ పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పేదలకు వరప్రసాదంగా మారిన ఉపాధి హామీ పథకం మండలంలో పూర్తిస్థాయిలో కొనసాగేందుకు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ముందుగా ఉపాధి హామీ పనులను ఎంపీపీ పూజలు చేసి ప్రారంభించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. సొసైటీ అధ్యక్షుడు అచ్యుతరాంబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, రాచూరి కుమార్, బండి శివాజీ, దివి సతీష్, సిరివెల్ల వెంకటేశ్వరరావు, పరసా నాగమల్లేశ్వరరావు, గంజాల బుజ్జి, ప్రసాద్, నాగరాజు, పేర్ని పృథ్వీ, టెక్నికల్ అసిస్టెంట్ బి.గోపాలకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ మద్దా గోపాలరావు పాల్గొన్నారు.

8న రన్‌ఫర్ జీసస్ జయప్రదం చేయండి

గుడివాడటౌన్: ప్రపంచ శాంతి కొరకు నిర్వహిస్తున్న రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం విజయవంతం చేయాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కోరారు. స్థానిక నాగవరప్పాడు రివైవల్ పెంతుకోస్తు చర్చి ఆవరణలో వివిధ సంఘాలకు చెందిన పాస్టర్లు, ప్రతినిధులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 8వ తేదీ ఉదయం 5.30 గంటలకు నాగవరప్పాడు నుంచి ఏలూరు రోడ్డు, నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్, బస్టాండ్ మీదుగా పామర్రు రోడ్డులోని ఆర్సీఎం చర్చి వరకు రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. క్రైస్తవ విశ్వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. బిషప్ రెవరెండ్ అప్పికట్ల జాషువా, రెవరెండ్ సజ్జా బర్నబాస్, పాస్టర్లు మందా సువర్ణబాబు, కేజే విక్టర్‌పాల్, నేలపాటి శామ్యూల్, జీపీ శేఖర్, డాక్టర్ యదీద్యా, ఆంథోని పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

కొండవరం(మొవ్వ): మండల పరిధిలోని కొండవరం గ్రామంలో సోమవారం అనారోగ్యంతో మృతి చెందిన పోలాభత్తిన బుజ్జమ్మ కుటుంబానికి వైఎస్సార్ ఉచిత బీమా పథకం ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను మంగళవారం అందజేశారు. గ్రామ సర్పంచ్ కొసరాజు జయలక్ష్మి, ఎంపీటీసీ ఉప్పలపాటి జ్యోతిలు మృతురాలి కుటుంబ సభ్యులకు నగదు అందించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ లలిత, వలంటీర్ కాకుల్ల అంజలి దేవి, పార్టీ నాయకులు కాకుల్ల మోహనరావు పాల్గొన్నారు.

10 మంది జూదరుల అరెస్ట్

మొవ్వ: మండల పరిధిలోని మూడు గ్రామాల్లో కూచిపూడి ఎస్‌ఐ డి.సందీప్ వరుస దాడులు నిర్వహించి 10 మంది జూదరులను, రూ.5 వేల నగదు, 3కోళ్ల స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని బార్లపూడిలో ముగ్గురు, పెదసనగల్లులో ఐదుగురు, అయ్యంకిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని సోమవారం కోర్టుకి హాజరుపర్చామని ఎస్‌ఐ వెల్లడించారు. మండల పరిధిలో ఏవిధమైన జూదాలు నిర్వహించినా 94407 96473 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా శత జయంతి బ్రహ్మోత్సవాలు

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ అలివేలు మంగా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి శత జయంతి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేద పండితులు అష్టోత్తర శత కలశాభిషేకం చేశారు. ఆలయం నిర్మించి 100 ఏళ్లు పూర్తి కావటంతో గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు కుటుంబ సమేతంగా వచ్చి స్వామి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో తిలకించారు. బ్రహ్మోత్సవాలను తిలకించటానికి భారీగా భక్తులు తరలివచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, గోవిందా నామ స్మరణతో మార్మోగింది. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత వీరపనేని శ్రీనివాస రామానుజం(నాని), పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షుడు పల్లా అరవింద్, మాజీ సర్పంచ్ ఎలిసి డేవిడ్ రాజు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం



మొవ్వలో విద్యార్థికి సాయం చేస్తున్న తోటి విద్యార్థులు



గుడివాడలో పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు



తోట్లవల్లూరులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న మహిళా పోలీసు

గుడివాడటౌన్: గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల పరిధిలోని అన్ని కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలు చేరుకున్నారు. 11,697 మంది విద్యార్థులకు గాను 11,547 మంది హాజరు కాగా 150 మంది గైర్హాజరైనట్లు డీవైఈఓ కార్యాలయ అధికారులు తెలిపారు.

తొలి రోజు ఐదుగురు గైర్హాజరు..

మొవ్వ: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. కూచిపూడి ఎస్‌ఐ డి.సందీప్ పర్యవేక్షణలో ఇద్దరు సచివాలయ మహిళా కానిస్టేబుళ్లు, ముగ్గురు కానిస్టేబుళ్లతో చెకింగ్, బందోబస్తును ఏర్పాటు చేశారు. మండలంలోని ఏడు పరీక్ష కేంద్రాలను ఎస్‌ఐ సందీప్ పరిశీలించి అధికారుల నుంచి సమాచారం సేకరించారు. కూచిపూడి కేంద్రంలో 65, కాజలో 61, కోసూరులో 89. పెదసనగల్లులో 77 మంది విద్యార్థులు 100 శాతం హాజరవ్వగా మొవ్వ ఏ సెంటర్‌లో 128 మందికి ఇద్దరు, మొవ్వ బీ సెంటర్‌లో 113 మందికి ఇద్దరు, నిడుమోలులో 52 మందికి ఓ విద్యార్థి గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి ఎన్.శివ శంకరరావు తెలిపారు.

తోట్లవల్లూరులో ప్రారంభం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు జెడ్పీ పాఠశాల, పెనమకూరు జెడ్పీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు తొలి రోజు తెలుగు పరీక్షను రాశారు. తోట్లవల్లూరులో 131 మంది, పెనమకూరు కేంద్రంలో 109 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఆయా కేంద్రాలను మండల విద్యాశాఖాధికారి జి.వెంకటేశ్వరరావు సందర్శించారు.

పామర్రులో ప్రశాంతం..

పామర్రు: ప్రశాంతమైన వాతావరణంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని పామర్రు జెడ్పీ హైస్కూల్, అసీస్సీ హైస్కూల్, ఏఎస్ఎం హైస్కూల్, అడ్డాడ, నిమ్మకూరు గ్రామాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 793 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పామర్రులోని పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంఈఓ పి.వి జయలక్ష్మి, ఎంపీడీఓ వై.రామకృష్ణ పరిశీలించారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు.

కైకలూరులో 14 పరీక్ష కేంద్రాల ఏర్పాటు



కైకలూరులో పరీక్ష గదుల వివరాలు చూసుకుంటున్న విద్యార్థులు

కైకలూరు: కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో మొత్తం 14 పరీక్ష కేంద్రాల్లో 2,598 మంది విద్యార్థులు మొదటి లాంగ్వేజీ పరీక్ష రాయాల్సి ఉండగా 2569 మంది రాశారు. 29 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. సప్లమెంటరీ విద్యార్థులు 16 మందికి ఒకరు హాజరు కాలేదు. కైకలూరు మండలంలో ఆటపాక గవర్నమెంటు హైస్కూల్, హోలీక్రాస్ స్కూల్, ఎస్‌ఎంఎల్‌పి బాలికల హైస్కూల్, భుజబలపట్నం హైస్కూల్, కలిదిండి మండలంలో కలిదిండి జెడ్పీ హైస్కూల్‌లో 2 సెంటర్లు, భాస్కరరావుపేట, ఆరుతెగళపాడు, కోరుకొల్లు, మండవల్లి మండలంలో మండవల్లి, చింతపాడు జెడ్పీ హైస్కూల్స్, ముదినేపల్లి మండలంలో ముదినేపల్లి సహాయమాత స్కూల్, పెదగొన్నూరు, ముదినేపల్లి హైస్కూల్స్‌లలో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం 8.30 గంటలకే ఎక్కువ మంది విద్యార్థులు సెంటర్లకు చేరారు. కైకలూరు హైస్కూల్ వద్ద ఏర్పాట్లను టౌన్ సీఐ ఎంవీఎస్.నాగరాజు పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామన్నారు. పోలీసు సిబ్బంది, సచివాలయ మహిళా కానిస్టేబుళ్లు విద్యార్థులను తనిఖీ చేశారు.

ప్రజా సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గోగం సురేష్, ఎంపీడీఓ సీతామహాలక్ష్మి తదితరులు

పెదపారుపూడి: గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యలను అధికారులు చిత్తశుద్ధితో పని చేసి పరిష్కరించాలని ఎంపీపీ గోగం సురేష్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత ఎంపీడీఓ అజెండాను సమావేశంలో చదివి వినిపించారు. గ్రామాల వారీగా ప్రజా ప్రతినిధులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీరు సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి నిర్మిస్తున్నారన్నారు. కొంత మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. మండల స్థాయి అధికారులు స్పందించి లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు పొనుగుమాటి రజిని, వెలగల పద్మ, ఎంపీటీసీలు చిగురుపాటి అశోకకుమారి, చదలవాడ పద్మ, సర్పంచ్‌లు పుణుకొల్లు శివరామప్రసాద్, నాగదేశి సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వి.నాగభూషణం, ఎంపీడీఓ టి.సీతామహాలక్ష్మి, ఈఓపీఆర్డీ ఎం.నాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

7 ఎకరాల్లో వరి కుప్పలు దగ్ధం



తగలబడుతున్న వరి కుప్పలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఉరుటూరు(పామర్రు): గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వరి కుప్పలకు నిప్పు అంటించిన సంఘటన పామర్రు మండలం ఉరుటూరు గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన చెన్ను సాయితేజ, కొడాలి త్రినాథ్‌లకు చెందిన 7 ఎకరాల పొలాన్ని పామర్రుకు చెందిన గుడివాడ సత్యప్రసాద్ అనే వ్యక్తి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం మినుము పంట ఉన్నందున మినుము నూర్చిన తర్వాత వరి కుప్పలు తీద్దామని అనుకుంటున్నారు. సోమవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో కొందరు దుండగులు 7 ఎకరాలకు చెందిన నాలుగు వరి కుప్పలకు నిప్పు అంటించి అక్కడి నుంచి పారిపోయారు. తెల్లవారుజామున 5 గంటల సమయంలో ప్రసాద్ పొలాన్ని పరిశీలించేందుకు అక్కడికి చేరుకునే సరికి వరి కుప్పలు తగలబడుతూ కనబడ్డాయి. వెంటనే పామర్రు మండల అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కాని వరి కుప్పలు పూర్తిగా అగ్నికి ఆహుతైనాయి. ఈ సంఘటనలో సుమారు రూ.3.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్ని మాపక అధికారి ఎస్.రాంబాబు తెలిపారు. సంఘటనా స్థలాన్ని రెవెన్యూ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పరిశీలించారు.

'స్పందన' సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

పామర్రు: స్పందన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ భరత్‌రెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని కొండిపర్రు గ్రామానికి చెందిన కొందరు తమ సాగు భూమిని ఎటువంటి అనుమతులు లేకుండా చెరువు తవ్వకం పనులు చేస్తున్నారన్నారు. దీని వలన పక్కనే ఉన్న పొలాలు బీడు భూములుగా మారేప్రమాదం ఉందని అదే గ్రామానికి చెందిన రైతులు స్పందనలో తహసీల్దార్‌కు అర్జీని సమర్పించారు. తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విషయమై తగు విధమైన పరిశీలనలు జరిపి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు బి.శ్రీనివాసరెడ్డి, ఎం.సుభాస్కరరెడ్డి, ఎం.రామిరెడ్డి, ఓంకారరెడ్డి, మున్నంగి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలి

కైకలూరు: గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు, కో–కన్వీనర్ టి.అప్పారావు రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ బి.మురళీకృష్ణకు సోమవారం అర్జీ అందించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సభలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వర్షంతో రాకపోకలకు అంతరాయం

మండవల్లి: మండలంలో సోమవారం కురిసిన వర్షానికి రహదారులపై వర్షం నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో వర్షం నీరు రోడ్లపై నిలిచి ఉండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కావడంతో విద్యార్థులు రాకపోకలు సాగించటానికి సమస్యలు ఎదుర్కొన్నారు. ఉనికిలి హరిజనవాడలో రోడ్డుపై వర్షం నీరు నిలిచి ప్రజలు అవస్థలు పడ్డారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోండి



యూనియన్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న రీజనల్ హెడ్ హరిరామ్

కైకలూరు: యూనియన్ బ్యాంక్ సేవలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ రీజనల్ హెడ్ హరిరామ్ చెప్పారు. ఆలపాడు గ్రామంలో పాత భవనం నుంచి నూతన భవనానికి మార్పు చేసిన బ్యాంక్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. యూనియన్ బ్యాంకు 1985లో చిన్నగా ప్రారంభించి ఇప్పుడు దేశస్థాయిలో సేవలు అందిస్తోందన్నారు. ఆలపాడు బ్రాంచిలో ఇప్పటికీ రూ.105 కోట్ల వ్యాపారం జరిగిందన్నారు. ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలిపారు. లాకర్ సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ జయరాజు, చీఫ్ మేనేజర్ శ్రీధర్, ఆలపాడు బ్రాంచ్ మేనేజర్ కె.దివ్య, వివిధ గ్రామాల ఖాతాదారులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన

కైకలూరు: స్థానిక కుమ్మరివీధి కోదండరామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా 17వ వార్షికోత్సవం ఇటీవల వైభవంగా జరిగింది. 3 వేల మంది భక్తులకు సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు కొమరిపాలెపు వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ నిడుమోలు కుమారి, శ్రీనివాసరావు, వెంకటరమణ, పెద్దిరాజు, కొమరిపాలెపు శ్రీనివాసరావు, నల్లూరి శ్రీనివాసరావు ఉన్నారు.

ఏడు కిలోల గంజాయి పట్టివేత



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు డిగ్రీ కాలేజీ రోడ్డులో విద్యార్థులకు విక్రయిస్తున్న ఏడు కిలోల గంజాయిని గుడ్లవల్లేరు పోలీసులు పట్టుకున్నారు. స్థానిక డిగ్రీ కాలేజీ రోడ్డులో గంజాయి విక్రయదారులు సోమవారం రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా సమాచారం అందుకున్న తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తాన్, ఎస్.ఐ వి.ఏసేబు తమ సిబ్బందితో పట్టుకున్నారు. నిందితులు కాటూరి సుబ్రహ్మణ్యం, మహ్మద్ బాషా, బండి తంబి, కొండా రాకేష, పెనుమూడి రంగారావు, కర్రే మిలాన్‌గా గుర్తించారు. విశాఖపట్నంకు చెందిన కొండ్రుపు లోవరాజు వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లుగా నిందితులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టు హాజరు పరచనున్నామని చెప్పారు.

60 మందికి వైద్య పరీక్షలు

వేములమడ(మొవ్వ): ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి సూచించారు. మొవ్వ మండలం వేములమడ గ్రామంలో సోమవారం 104 సంచార వైద్యశాల 104 ద్వారా 60 మందికి వైద్య సేవలు అందించారు. మొవ్వ పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సీహెచ్ రాజేశ్వరి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ బి.విజయ్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ అశ్విత, డీఈఓ కైలా కోమలి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వలంటీర్లు అంకితభావంతో విధులు నిర్వహించాలి

ముదినేపల్లిరూరల్: గ్రామ వలంటీర్లు అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీడీఓ పి.మల్లీశ్వరీ ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నియమించిన వలంటీర్లకు మండల పరిషత్ కార్యాలయంలో నియామక పత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత ఆశయంతో గ్రామాల అభివృద్ధికి సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి వలంటీర్లను నియమించారన్నారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలు గడప వద్దే ప్రజలకు అందుతున్నాయని చెప్పారు.